క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఎపిస్టిమో గ్లోబల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ జి.ఉమా రాణి తెలిపారు. ఫీడర్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ, రామ్‌రెడ్డి లేఅవుట్, నల్లగండ్ల, సాధన స్కూల్ బ్యాక్ సైడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

లేక్ వ్యూ ఫీడర్ పరిధిలో..

11 కేవీ లేక్ వ్యూ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు .. నల్లగండ్ల డీమార్ట్ బ్యాక్ సైడ్ ఏరియాతో పాటు నల్లగండ్ల హుడా కాలనీలో విద్యుత్ ఉండదు.

తారానగర్ ఫీడర్ పరిధిలో..


తారానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు .. తారానగర్, శాంతినగర్, చందానగర్ మెయిన్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించాలని కోరారు.

5న 'సీఓఈ' అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఇంటర్మీడియట్ అర్హత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీఓఈ–2023 పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు సకాలంలో హాజరవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే రావాలని ఆమె సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తీసుకురావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం


ప్రొ.నారాయణ చంద్రన్


ప్రొ.ప్రమోద్ కే నాయర్

రాయదుర్గం: ఆసియాలో టాప్–20 ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ పరిశోధకుల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవకాశం దక్కింది. వరుసగా నాలుగో సంవత్సరం విడుదల చేసిన సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్, సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయ నివేదిక 'భారతదేశం, దక్షిణాసియా, తూర్పు ఆసియాలో కళలు, హ్యుమానిటీస్ పరిశోధనలో ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు నారాయణచంద్రన్, ప్రమోద్. కె.నాయర్‌లకు అవకాశం లభించింది. ప్రొఫెసర్లకు గుర్తింపు రావడం ఆనందకరమని హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు.

ఎఫ్‌ఓబీ నిర్మాణ పనులు పరిశీలన



రాయదుర్గం: పాదచారుల సౌకర్యార్థం రాయదుర్గం మల్కంచెరువు సమీపంలో నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు పరిశీలించారు. గురువారం ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పనులను పరిశీలించారు. అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్న నేపథ్యంలో ఎస్కులేటర్, లిఫ్ట్ పనులను వారు పరిశీలించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులు ఆదేశించారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): వాణిజ్య, గృహ సముదాయాలకు సంబంధించిన పన్నులను వందశాతం వసూలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ సూచించారు. పన్నుల వసూలుకు ఆయాశాఖల అధికారులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశంఏర్పాటు చేశారు. పన్నులను వసూలు చేయడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రాజేంద్రకుమార్

ఉసురు తీసిన ఉపాధి

- ఓఆర్‌ఆర్‌పై మొక్కలు నాటే పనులు, సంరక్షణ
- కూలీలంతా కర్ణాటకవాసులే
- ఓఆర్‌ఆర్ టోల్‌ప్లాజాకు ఆనుకొని గుడిసెల ఏర్పాటు
- పోలీసులు హెచ్చరించినా పట్టించుకోని అధికారులు


ఓఆర్‌ఆర్ వద్ద ప్రమాదకర ప్రాంతంలో గుడిసెలిలా..


సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బతుకుదెరువుకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కూలీలకు భద్రత కరువైంది. కూలీలను తీసుకొస్తున్న వారు భద్రత కల్పించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఇందుకు నిదర్శనం కొల్లూరు వద్ద జరిగిన ప్రమాదమే. ఓ కాంట్రాక్టర్ ఓఆర్‌ఆర్‌పై మొక్కలు నాటడం, వాటి రక్షణకు కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా జింకేరా తండా నుంచి సుమారు 40 కుటుంబాలను తీసుకొచ్చాడు. వారు కొల్లూరు టోల్‌ప్లాజాకు ఆనుకొని రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు మధ్యలో మొక్కలు నాటే ప్రదేశంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. ప్రమాదకర ప్రదేశంలో గుడిసెలు ఉన్నా అటు అధికారులు ఇటు కాంట్రాక్టర్ వారిని పట్టించుకోలేదు. ఫలితంగా గురువారం జరిగిన ప్రమాదంలో ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

ఇదే చోట గతంలోనూ ప్రమాదాలు..

మితిమీరిన వేగం, నిద్రమత్తుతో భారీ వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డుపైకి దూసుకొచ్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయాలు తెలిసినా అధికారులు గుడిసెల విషయం ఎందుకు పట్టించుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ గుడిసెలు వేసుకోవడం ప్రమాదమని కాంట్రాక్టర్‌కు, అధికారులకు తెలియదా? లేక ఏమవుతుందిలే అని వదిలేశారా? అనేది అందరిని తొలుస్తున్న ప్రశ్న. ఇక్కడ ఉండటం ప్రమాదకరమని పలువురు కూలీలు ఇక్కడి వచ్చిన సమయంలో సిబ్బందిని ప్రశ్నిస్తే గతంలో అనేకమంది కూలీలు ఇదే మాదిరి గుడిసెలు వేసుకున్నారని, వారికి జరగని ప్రమాదం మీకెందుకు జరుగుతుందని కూలీలతో అన్నట్లు ఓ కూలీ వాపోయాడు. అప్పుడే తమను హెచ్చరించి ఉంటే ముగ్గురి ప్రాణాలు పోయేవి కాదని తోటి కూలీలు కన్నీరుపెట్టుకున్నారు. ప్రమాదానికి గురైన లారీ మరికొంత ముందుకు దూసుకుని పోయి ఉంటే భారీప్రాణం నష్టం జరిగి ఉండేది. తెల్లవారుజామున ప్రమాదం జరిగిన వెంటనే ముగ్గురు దుర్మరణం చెందడంతో అక్కడ కూలీలు వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పిల్లలతో బయటకు పరుగెత్తారు. ఇక ఈ ప్రాంతంలో తాము ఉండలేమని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెలోని సామాన్లను సర్దుకుని వారి పిల్లలను తీసుకుని రోడ్డుపై కూర్చోవలసిన పరిస్థితి నెలకొంది. గతంలో వలస కూలీలు ఇదే విధంగా గుడిసెలు వేసుకొని ఉండటంతో ట్రాఫిక్ పోలీస్ అధికారులు వారిని హెచ్చరించారు. అయితే కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు సైతం బేఖాతర్ చేయడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో అధికారులు స్పందించి ఉంటే ఈ రోజున ఈ సంఘటన జరిగి ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు.

భయభ్రాంతులైన కూలీలు

నిద్రలో ఉండగానే తోటివారు మృతి చెందడంతో వలస కూలీల కుటుంబాలు భయభ్రాంతులకు గురయ్యారు. గుడిసెల్లోని సామాన్లను సర్దుకొని రోడ్డుపై కూర్చున్నారు. ఇంత ప్రమాదకరమైన స్థలంలో ఉన్న తమకు ప్రమాదమని ఎవరూ చెప్పకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాం



తెల్లవారుజామున పెద్ద శబ్దం వచ్చింది. లేచి చూసే సరికి మాగుడిసెల పైకి లారీ దూసుకొచ్చింది. భయంతో పిల్లలను తీసుకుని బయటకు వచ్చాం.ఇక్కడ గుడిసెలు వేసుకొని అందరం నివసిస్తున్నాం. ఈ ప్రాంతం ఇంత ప్రమాదకరమని మాకు ఎవరు చెప్పలేదు.

– గోవింద్, కర్ణాటక వాసి

గతంలోనే హెచ్చరించారు



ఇలా గుడిసెలు వేసుకొని నివసించడం ప్రమాదకరమని గతంలో ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– పి.నరసింహారావు, ఏసీపీ మియాపూర్

ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం

ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.50 వేలు అందించాం. ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఇలాంటి నివాసాలు ఉంటే వారిని వేరే ప్రాంతాలకు తరలించాలని అధికారులను కోరుతున్నాం.

– గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే



రవికుమార్ యాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన హఫీజ్‌పేట్ యువత

యువకులంతా బీజేపీ వైపే...

- రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని యువత బీజేపీ వైపే ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ అన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన యువకులు లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన అధ్వానంగా మారిందన్నారు. కంచె చేను మేసింది అన్నట్లుగా పాలకులే ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తూ అభివృద్ధిని కుంటుపరిచారన్నారు. పార్టీలో చేరిన వారిలో సచిన్‌గౌడ్, మహేష్ రెడ్డి, అభిషేక్, కిరణ్, సాయి యాదవ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, టర్బో శ్రీనివాస్, అశోక్, రవి ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రాజకీయాలకతీతంగా గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జిన్నారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 41మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం జంగంపేట గ్రామంలో హెచ్‌ఎండీఏకు భూములను అందించిన రైతులకు పరిహారంగా 600గజాల చొప్పున సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, తహసీల్దార్ దశరథ్‌సింగ్ రాథోడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం మరోసారి గ్యాస్ ధరలు పెంచి పేదలు, మధ్యతరగతి వారిపై మోయలేని భారం మోపడం దారుణమని సీఐటీయూ జిల్లా కోశాధికారి నాయిని నర్సింహారెడ్డి విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలంటూ పటాన్‌చెరు జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్, మని రాజు, వెంకటేశ్వరరావు, నాయుడు, రామ్‌చందర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలో కూర్చోగానే గుండెపోటు..
ఆస్పత్రికి తరలిస్తుండగా కార్మికుడు మృతి


మృతుడు శ్రీనివాస రాజు(57)

పటాన్‌చెరు టౌన్: టిఫిన్ చేసేందుకు ఓ కార్మికుడు సంసిద్ధమవుతుండగా గుండెపోటుతో కుర్చీలో నుంచి కింద పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని వెల్లడించారు. ఈ సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ ప్రగతినగర్‌కు చెందిన గోకరాజు శ్రీనివాస రాజు(57) వెల్జన్ న్యూమటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గత 20 సంవత్సరాలుగా ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం ఉదయం జనరల్ షిఫ్ట్‌కు వచ్చి తన చాంబర్‌లో టిఫిన్ చేసేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటుతో కుర్చీలో నుంచి ఒకసారిగా కింద పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చీరల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని బొంబాయి కాలనీలో బుధవారం రాత్రి పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శాంతమ్మ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చీరలు పంపిణీ చేశామన్నారు.

ట్రిపుల్ ఐటీ సీఐఈలో డెమో డే

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) డెమో డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 స్టార్టప్‌లు 50కిపైగా పెట్టుబడి నిధులకు పిచ్ చేయబడ్డాయి. ఆవిష్కార్ 16వ బృందంలో డీప్‌టెక్, మెడ్‌టెక్, మీడియా టెక్ డొమైన్ నుంచి స్టార్టప్‌లు చేర్చబడ్డాయి. సీఐఈ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సీఓఓ ప్రొఫెసర్ రమేష్ లోకనాథన్ మాట్లాడుతూ 50కి పైగా ఎక్కువ మంది పెట్టుబడిదారులు మా డెమోడేలో చేరడం, అటువంటి లోతైన సాంకేతిక ఆవిష్కరణలపై ఆసక్తి చూపడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీపై వెబినార్

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ హైదరాబాద్–విశాఖపట్టణం సంయుక్తంగా 'ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీలో కెరీర్' అనే అంశంపై మార్చి 5, ఆదివారం ఉదయం 11.00 నుంచి 12.30 గంటల మధ్య వెబినార్ నిర్వహిస్తారని డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫొటోగ్రఫీలో అవార్డు గ్రహీత శ్రీనాగ్ పిక్చర్స్ వ్యవస్థాపకుడు బీఆర్‌ఎస్ శ్రీనాగ్ ఈ వెబినార్‌లో ముఖ్య వక్తగా పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు అసోసియేట్ ప్రొఫెసర్ కె. నాగేశ్వరరావు 98666 19639ను సంప్రదించాలని కోరారు.

శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామచంద్రపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేశ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని అశోక్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నిర్వహించిన బస్తీ దర్శన్ కార్యక్రమంలో స్థానికులు డ్రైనేజీ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామన్నారు. కాలనీలో పలుచోట్ల డ్రైనేజీ సమస్య ఉందని కాలనీవాసులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శేషిరెడ్డి, సీనియర్ నాయకులు బూరుగడ్డ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో పూర్వ విద్యార్థుల స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డా. జి. నాగయ్య, ప్రెసిడెంట్ జి.భాస్కర్‌రావు, డైరెక్టర్లు మధుసూదన్‌రావు, ఎస్. అరవింద్‌రావు, ప్రిన్సిపాల్స్ ఎ. పద్మప్రియ, చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు అతిథుల చేతుల మీదుగా పట్టాలను అందుకున్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం


పాపిరెడ్డినగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై గురువారం ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీలు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజస్థాన్, బిహార్ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారిని ఎంపీ రంజిత్‌రెడ్డి పలకరించారు. సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు భీమా వంటి అనేక పథకాలను అందజేస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, కమిటీల ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

గచ్చిబౌలి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని 4వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఏడీఈ రాము తెలిపారు. గచ్చిబౌలిలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో గచ్చిబౌలి సబ్ డివిజన్‌లోని గచ్చిబౌలి, తారానగర్ సెక్షన్ పరిధిలోని వినియోగదారుల కోసం జరిగే ఈ సమావేశంలో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, సభ్యులు, కన్స్యూమర్ ఎఫైర్ సభ్యులు పాల్గొంటారు. విద్యుత్ వినియోగదారులు వారి యొక్క దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతోపాటు బిల్లుల్లో హెచ్చుతగ్గుల విషయంపై కూడా ఫిర్యాదు చేసి తగు పరిష్కారం పొందగలరని అధికారులు కోరుతున్నారు. ఈ అవకాశం విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుడి ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్: మరో నెల రోజుల్లో ఉద్యోగ విరమణ ఉందని యజమాన్యం నోటీసులు ఇవ్వడంతో ఓ కార్మికుడు పరిశ్రమలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏపీలోని నెల్లూరుకు చెందిన కృష్ణయ్య(58) బతుకుదెరువు కోసం వచ్చి నల్లగండ్లలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామిక వార్డులోని ఎన్విరాటెక్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. రిటైర్‌మెంట్ మరో నెల ఉండడంతో మరో రెండేళ్లు పొడిగించమని పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధు సుందర్‌ను కోరాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణయ్యకు నెలరోజుల్లో ఉద్యోగ విరమణ ఉందని నోటీసులు ఇచ్చాడు. దీంతో మనస్తాపం చెంది పరిశ్రమలో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే సమాచారం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు పరిశ్రమను సందర్శించి యజమాన్యం నోటీసులు ఇవ్వడంతోనే కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని, నష్టపరిహారం చెల్లించాలని, నోటీసులు ఇచ్చిన యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిరుపేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌కు చెందిన 11 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు రావడానికి కృషి చేసిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు వినతి


బండిసంజయ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రవికుమార్‌యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయను కొనసాగించేలా చూడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయ పరిరక్షణ సమితి ప్రతినిధులు, తల్లిదండ్రులు ఆయనను గురువారం ఆయనను నగరంలో కలిశారు. కేంద్రీయ విద్యాలయ గురించి ఆయనకు వివరించారు. ప్రస్తుతం ఈ స్కూల్‌ను మూసి వేయాలని హెచ్‌సీయూ నిర్ణయించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడతారని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సైక్లింగ్ సంఘ సభ్యులకు సీపీఆర్ శిక్షణ


సభ్యులకు సీపీఆర్ శిక్షణ ఇస్తున్న ఎస్‌ఎల్‌జీ వైద్య బృందం

గచ్చిబౌలి: అత్యవసర సమయాల్లో పక్కన ఉన్నవారి ప్రాణాలను రక్షించడానికి బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్‌ఎస్) శిక్షణ చాలా ముఖ్యం. ప్రధానంగా సీపీఆర్ చేయడం తెలిస్తే ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వెలుపల ప్రాంతంలో సుమారు వంద మంది సైక్లింగ్ సంఘం సభ్యులకు ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రికి చెందిన ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ టి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో అదే విభాగానికి చెందిన డాక్టర్ హేమసింధు, డాక్టర్ విఠల్‌లు సభ్యులతో బొమ్మలపై సీపీఆర్ ప్రాక్టీస్ చేయించారు. ప్రతి ఒక్కరూ స్వయంగా చేయడం ద్వారా ఎక్కడ ఎంతసేపు కంప్రెషన్లు ఇవ్వాలో తెలుసుకున్నారు. ఇది తోటి వారి ప్రాణాలను కాపాడేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.